క్లుప్తంగా

భక్తులకు వాటర్ ప్యాకెట్ల పంపిణీ



చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్రా స్వామి బ్రహ్మోత్సవాలు సందర్భంగా దేవాలయ ఆవరణలో గురువారం భక్తులకు భారతి సిమెంట్ ఆధ్వర్యంలో వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఏటా బ్రహ్మోత్సవాల్లో భక్తులకు వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు కొండల్ రెడ్డి, మేనేజర్ సతీష్‌కుమార్ తెలిపారు.
మండల కేంద్రానికి చెందిన ఆర్‌ఎంపీ చిల్వేరు శ్రీనివాసులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరం భక్తులకు అవసరమైన మందులు అందజేస్తున్నారు. 7 రోజులు శిబిరం ఉంటుందని, భక్త లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్

పెంట్లవెల్లి: మండలంలోని జటప్రోల్‌లో గురువారం సర్పంచ్ ఎస్‌కె ఖాజా గ్రామానికి చెందిన కృష్ణయ్యగౌడ్‌కు రూ.60వేలు, కటిక బాలరాజుకు రూ.26 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎంతో మంది పేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంగా మారిందని అన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

కల్వకుర్తిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం, స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని లయన్స్ క్లబ్ నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్ అన్నారు. గురువారం పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కల్వకుర్తి ప్రీమియర్ లీగ్–2 మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

చలివేంద్రం ఏర్పాటు



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. గురువారం ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎంఒ సత్యనారాయణప్రారంభించారు. ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం శుభపరిణామమని తెలిపారు. కార్యక్రమంలో డీఎం రాజేశ్వర్, శ్రీనివాసరావు, హిమకుమార్, శోభారాణి, ఎల్లయ్యయాదవ్, సుధీర్, రాము, నారాయణ తదితరులున్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కొల్లాపూర్: పట్టణంలోని రామాలయంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి 6 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు బీరం నిరంజన్‌రెడ్డి తెలిపారు. 3న దేవతామూర్తుల కల్యాణం, 5న రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శ్రీరామనవమి పర్వదినం ముగిసిన తర్వాత ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తాడూరు: కోయిల్‌కొండలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పంటించిన నిందితులను అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బాలవెంకటయ్య, కురుమూర్తి, చింతసత్తి, అర్జున్, మల్లేష్, బాలరాజుపాల్గొన్నారు.

సూపర్ లగ్జరీ బస్సులు ప్రారంభం

కందనూలు: నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపోలో కొత్తగా వచ్చిన మూడు సూపర్ లగ్జరీ బస్సులను గురువారం బస్టాండ్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం అయినప్పటి నుంచి రద్దీ ఎక్కువగా ఉందని, అందుకు తగినట్లు బస్టాండ్ లేకపోవడం ఇబ్బందిగా ఉందన్నారు. రూ.8 కోట్లతో కొత్తగా నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బస్సును నడిపారు. కార్యక్రమంలో డీఎం ధరమ్‌సింగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ పంచాయితీ

ఉప్పునుంతల: మండలంలోని ఫిరట్వానిపల్లిలో గురువారం శ్రీరామనవమి సందర్భంగా ఎంపీ రాములు, ఆయన కుమారుడు భరత్‌ప్రసాద్ అభిమానులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ పంచాయితీకి దారి తీసింది. దీంతో సర్పంచ్ శివుడు, అతని అనుచరులు ఏనాడు లేనిది శ్రీరామనవమి నాడు నియోజవర్గంలో వివాదాస్పదంగా ఉన్న ఫ్లెక్సీలు పెట్టరాదని వారించారు. ఈ క్రమంలోనే ఆలయం వద్ద ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అనుచరుడైన సర్పంచ్, అతని తల్లి అంగన్‌వాడీ టీచర్, వార్డు సభ్యుడు పెబ్బేటి భీమయ్యపై చేయి చేసుకున్నారని తెలిపారు.



కోడేరు మండలం రాజాపూర్‌లో..



కల్వకుర్తిలో జీలకర్ర, బెల్లం కార్యక్రమం నిర్వహిస్తున్న పురోహితులు



లింగాలలో కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు



కొల్లాపూర్‌లో ఊరేగింపు చేపట్టిన యువకులు

రాములోరి కల్యాణ మహోత్సవం

జిల్లా వ్యాప్తంగా గురువారం రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. కల్యాణవేదికను పూలు, మామిడి తోరణాలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. వేదికపై సీతారాముల సమేత లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను ఉంచిన వేద పండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతును జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



లింగాలలో కల్యాణాన్ని తిలకించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

■ బిజినేపల్లి మండలంలోని వట్టెం, గంగారం, పాలెం, వెల్గొండలో సీతారాముల కల్యాణం కనుల పండువగా నిర్వహించగా, తిమ్మాజిపేట మండలంలోని ఆవంచ, పోతిరెడ్డిపల్లి, చేగుంటలో వేడుకని భక్తులు తిలకించారు.
■ ఉప్పునుంతల కేదార్వేశరాలయం, కంసానిపల్లి శ్రీరామ గట్టుపై, మామిళ్లపల్లి, వెల్టూరు, తిప్పాపూర్, పెనిమిళ్ల ఆలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.
■ బల్మూర్ మండలంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం సీతారాముల పల్లకీ సేవ చేశారు.
■ కల్వకుర్తి పట్టణంలోని హనుమాన్‌దేవాలయం, షిరిడీ సాయి దేవాలయాల్లో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.
■ వెల్దండ మండల కేంద్రంతో పాటు కంటోనిపల్లి, చొక్కన్నపల్లి, చెదురుపల్లి, రాచూర్, అజిలాపూర్‌లో హన్‌మాన్ దేవాలయాల్లో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.
■ లింగాల మండల కేంద్రంలోని కోదండరామాలయంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. అంబట్‌పల్లి, శాయిన్‌పేటలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.

■ అచ్చంపేట మండలంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12తర్వాత వేద పండితులు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. పట్టణంలోని వివిధ దేవాలయాల వద్ద ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, అమల దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.

■ దోమలపెంట కోదండ రామాలయం, ఈగలపెంటలోని సాయి మందిరంలో రాములోరి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.
■ కొల్లాపూర్ మండలంలోని కుడికిల్లలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారికి రథోత్సవం చేపట్టారు.
■ కొల్లాపూర్ పట్టణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యువకులు బైక్ ర్యాలీ చేపట్టారు.
■ కోడేరుతో పాటు రాజాపూర్, మైలారం స్వామి వారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, సత్యనారాయణస్వామి వ్రతం, మహామంగళహారతి నిర్వహించి సీతారామ కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించినట్లు ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ తెలిపారు.

■ తెలకపల్లి కన్యకా పరమేశ్వరి ఆలయం, ఎస్సీ కాలనీ, రాకొండ రామలింగేశ్వరదేవాలయం వద్ద, రాంరెడ్డిపల్లి, గౌరెడ్డిపల్లి, ఆలేరు పబ్బతి ఆంజనేయస్వామి దేవాలయం, గడ్డంపల్లిలో కల్యాణోత్సవం నిర్వహించారు.

■ పెంట్లవెల్లి మండలంలోని గోపులాపురం, జటప్రోల్‌లో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.
■ అమ్రాబాద్, పదరతో పాటు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కోదండ రామాలయం, పదర రామాలయం, మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయాల్లో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు.
■ తాడూరు మండల కేంద్రంతోపాటు గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.
■ అచ్చంపేట వాసవీ కన్యకా పరమేశ్వరీ, ఆంజనేయ అయ్యప్పస్వామి దేవాలయం, భ్రమరాంబ దేవాలయం, మారుతినగర్ ఆంజనేయస్వామి, భక్త మార్కేండేయ ఆలయాల్లో వేడుకలు నిర్వహించారు.



వట్టెంలో జీలకర్ర బెల్లం కార్యక్రమం..

■ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంతోపాటు పెద్ద కార్పాముల, తిరుమలాపూర్, చంద్రకల్, నక్కలపల్లి, గంట్రావ్‌పల్లిలో సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

■ మన్ననూర్‌లోని కోదండరామస్వామి, మాచారంలో సీతారామాంజనేయ స్వామి ఆలయంలో భక్తులు శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.
■ వంగూరు మండలంలో గెల్వాలాంబమాత ఆలయ ప్రాంగణంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.



వంగూరు మండలంలో..



పెద్దకొత్తపల్లిలో..



వెల్దండలోని హన్‌మాన్ ఆలయంలో..



ఉప్పునుంతల కేదారేశ్వరాలయంలో..



పెంట్లవెల్లి మండలంలో..



తాడూరు మండలంలో..



దోమల పెంటలో..

ఘనంగా ఎమ్మెల్యే మర్రి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న జక్కా రఘునందన్‌రెడ్డి

కందనూలు: ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్ శ్రేణులు జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టి, టపాసులు కాల్చారు. డీజే పాటలతో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆడిపాడారు. కార్యకర్తలకు తోడుగా ఎమ్మెల్యే డ్యాన్స్ చేస్తూ అలరించారు. అనంతరం బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే భారీ కేక్‌ను కట్ చేశారు. గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. అదేవిధంగా నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలో అన్ని వార్డులలో కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేశారు.

వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించండి



అచ్చంపేట ఆస్పత్రి వద్ద మాట్లాడుతున్న వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఆస్పత్రిలో వైద్యులు సక్రమంగా ఉండటం లేదని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం ఆయన ఆస్పత్రిని పరిశీలించారు. ఉదయం 10:40 గంటలకు కూడా ఒక్క వైద్యుడు లేరని, వైద్యం కోసం రోగులు ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నల్లమల ప్రాంతంలోని సుదూర ప్రాంతాల నుంచి రోగులు ఆస్పత్రికి వస్తారని, గర్భిణులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఆస్పత్రి, స్కూళ్లు, కళాశాలలపై దృష్టి పెట్టడం లేదన్నారు.

పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

బల్మూర్: రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని కొండనాగులలో గురువారం మూడో రాజో హాథ్ సే హాథ్ జోడో యాత్ర చేపట్టారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి గ్రామంలో ప్రజాప్రతినిధులు పనితీరు, అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో గ్రూపు రాజకీయాలు తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో శ్రీపతిరావు, వెంకట్‌రెడ్డి, వెంకటయ్య, రమేష్, నారాయణగౌడ్, బుచ్చయ్య, సాయి, మొగులాల్, కొండల్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మాచారంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ స్థాయి బండలాగుడు పోటీలను జలంధర్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. 13 జతల వృషభాలు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ. 15వేలు తాడూరుకు చెందిన ఎద్దుల యజమాని గునమోని సత్యంకు, రెండో బహుమతి రూ. 10వేలు ఎల్మపల్లికి చెందిన ఎద్దుల యజమాని కడారి బాలయ్యకు, మూడో బహుమతిగా రూ. 5వేలు పోలిశెట్టిపల్లి చెందిన ఎద్దుల యజమాని బురాన్ పాషకు దాత జలంధర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అంతకుముందు గ్రామంలోని పురవీధుల్లో స్వామి వార్ల పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ పెద్దిరాజు, ఉప సర్పంచ్ ఆనంద్, రాంచంద్రయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.



బండను లాగుతున్న వృషభాలు

ర్యాలీ జయప్రదం చేద్దాం



కొల్లాపూర్: ఢిల్లీలో ఏప్రిల్ 5న చేపట్టబోయే మజ్దూర్ కిసాన్ ర్యాలీని జయప్రదం చేసేందుకు రైతులు తరలిరావాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో కిసాన్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏకకాలంలో దేశవ్యాప్తంగా రుణమాఫీని కేంద్రం ప్రకటించాలన్నారు. రైతులకు ప్రత్యేక పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. చమురు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలపీరు, భాస్కర్, సలీం, రవి, చంద్రమౌళి, శంకర్, రామయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఉద్యోగుల కమిటీ ఎన్నిక



కందనూలు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జిల్లా జేఏసీని గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా రవిరాజ్, కోశాధికారిగా ఆనంద్ కుమార్, కో కన్వీనర్లుగా రాజేశ్వరి, దేవేందర్, భాస్కర్, ఇసాక్ ఇతరలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలకు మిత్రుల చేయూత



ఆర్థికసాయం చేస్తున్న మిత్ర బృందం

లింగాల: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు మృతి చెందగా, బాధిత కుటుంబాలకు తోటి మిత్రులు అండగా నిలిచారు. 1983–84 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసులు ఇటీవల మృతి చెందగా, పూర్వపు విద్యార్థులు రూ. 25 వేలు అందించారు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన కోనేటి చిరంజీవి మృతి చెందడంతో 1993–94 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.30 వేలు ఇచ్చారు. కార్యక్రమంలో రాంజీనాయక్, మల్లేష్, గోపి, ముక్తార్, దేవుల, ఆంజనేయులు, ఉమాశంకర్, శ్రీనివాసులు, నిరంజన్ తదితరలు పాల్గొన్నారు.